క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 9న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. గోపాల్‌పూర్ సబ్‌స్టేషన్ ప్రాంతంలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, పెద్దమ్మగడ్డ, రాంపూర్, మడికొండ, సోమిడి సబ్‌స్టేషన్ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి 11 గంటల విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చైతన్యపురి కాలనీ, బ్యాంక్ కాలనీ, టీచర్స్ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, కాపువాడ, అలంకార్, కాకతీయ కాలనీ, గుండం, విజయ డైరీ, ఉజ్లీబేస్, గఢీ మసీదు, జామా మసీదు ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, నయీంనగర్, లష్కర్ సింగారం, పోలీసు కాలనీ, పోలీసు హెడ్‌క్వార్టర్, వాగ్దేవి కళాశాల ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ కోత విధించనున్నట్లు తెలిపారు. అలాగే, వరంగల్‌లోని స్టేషన్ రోడ్డు, ఆజంజాహి మిల్, ఖిలా వరంగల్, గొర్రెకుంట, ఉర్సు, దేశాయిపేట, ఆరెపల్లి సబ్‌స్టేషన్ ప్రాంతాల్లో ఉదయం 9నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ శెంకేసీ మల్లికార్జున్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

హసన్‌పర్తి: చింతగట్టు, నాగారం, ఎల్లాపురం సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో శనివారం ఉదయం 9గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ సామ్యానాయక్ తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు.

ఐఎంఏ ఎన్నికల అధికారిగా వద్దిరాజు రాకేష్

ఎంజీఎం: ఈనెల 26న నిర్వహించనున్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వరంగల్ బ్రాంచ్ 2024 – 25వ సంవత్సర నూతన కార్యవర్గ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా డాక్టర్ వద్దిరాజు రాకేష్‌ను నియమిస్తూ ఐఎంఏ పాలకవర్గం తీర్మానం చేసింది. సహాయ ఎన్నికల అధికారులుగా డాక్టర్ బందెల మోహన్‌రావు, డాక్టర్ ఆనంద్ భోకరేలను నియమిస్తూ పాలకవర్గ సభ్యులు నిర్ణయించారు. ప్రెసిడెంట్ (1), వైస్ ప్రెసిడెంట్ – మహిళ (1), రూరల్ (1), అర్బన్ (1), జనరల్ సెక్రటరీ (1), జాయింట్ సెక్రటరీ – మహిళ (1), రూరల్ (1), అర్బన్ (1), కోశాధికారి (1), రాష్ట్ర కౌన్సిల్ మెంబర్లు (24), బిల్డింగ్ కమిటీ మెంబర్లు (6) స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు వివరించారు.

వెంకన్న ఆలయంలో వైభవంగా ఆకాశ దీపోత్సవం



కాజీపేట: కార్తీక మాసోత్సవాలను పురస్కరించుకుని కాజీపేట 61వ డివిజన్ చైతన్యపురి కాలనీలోని వేంకటేశ్వర స్వామి దేవాలయ ఆవరణలో శుక్రవారం ఆకాశ దీపోత్సవాన్ని భక్తులు వైభవంగా జరుపుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు రఘురామాచార్యులు.. ధ్వజ స్తంభం ఎదుట ఆకాశ దీపోత్సవాన్ని ఎగురవేసి పూజలు చేశారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాల వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పంజాల అశోక్‌కుమార్ గౌడ్, కెప్టెన్ వడ్డెపల్లి నరేందర్ పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



ఖిలా వరంగల్: వరంగల్ రైల్వేస్టేషన్, శివనగర్, ఫోర్ట్‌రోడ్డుపై జీవనం సాగిస్తున్న అనాథ వృద్ధులు, యాచకులకు స్థానిక నేత శ్రీరాం రాజేష్, కన్నోజు లావణ్యతో కలిసి సామాజికవేత్త, కాంగ్రెస్ నాయకుడు పగడాల సతీష్ శుక్రవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభాగ్యులకు దాతలు చేయూతనందించాలని కోరారు. కార్యక్రమంలో బత్తుల నవీన్, మంతెన సంధ్య, అక్షిత్, నాగరాణి, నాగరాజు, సంతోష్, బాల్య కుమార్, భాస్కర్ పాల్గొన్నారు.

చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడిగా సుధాకర్



విద్యారణ్యపురి: తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్రస్థాయి సమావేశాన్ని హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ జేఏసీ చైర్మన్ డాక్టర్ మేడారపు సుధాకర్‌ను చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడిగా, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్‌గా అదనపు బాధ్యతలతో నియమించారు. ఈమేరకు తెలంగాణ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ ఉత్తర్వులు జారీచేశారు.

ప్రభుత్వ ఐటీఐకి దొరకని స్థలం

- భవన నిర్మాణాలకు స్థలం లేక ఇక్కట్లు
- అధికారులు స్పందించాలని కోరుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

కాజీపేట: కాజీపేట ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)కు నూతన భవన నిర్మాణాల నిమిత్తం ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం రూ.4.5 కోట్లు మంజూరు చేసింది. విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే సంకల్పంతో సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఐటీఐలను మరింతగా బలోపేతం చేయాలని ఆదేశించారు. సీఎం ఆదేశాలకు అనుగుణంగా అధికారులు ఐటీఐలను స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలుగా మార్చాలని నిశ్చయించారు. ఇందుకోసం తెలంగాణ ప్రభుత్వం టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ (టీటీఎల్)తో ఒప్పందం కుదుర్చుకుంది.

భవనాల నిర్మాణానికి రూ.4.5 కోట్లు

యువతకు ఉపాధి అవకాశాలు పెంచేలా ఆధునిక కోర్సుల్లో శిక్షణ ఇవ్వడానికి కావాల్సిన వనరులను సమకూర్చడం కోసం ప్రయత్నాలు మొదలయ్యాయి. ప్రస్తుత ఐటీఐలు నిర్వహిస్తున్న ప్రాంతాల్లోనే నూతన భవనాలు నిర్మించి విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించి, ఉపకరణాలు సమకూర్చి నూతన కోర్సులు ప్రవేశపెట్టాలనే లక్ష్యంతో కాజీపేటకు అన్ని హంగులతో కూడిన భవనాల నిర్మాణానికి రూ.4.5 కోట్ల నిధులు మంజూరయ్యాయి. అయితే అసలు సమస్య అంతా ఇక్కడి నుంచే ప్రారంభమైందని అధికారులు తర్జనభర్జన పడుతున్నారు.



కాజీపేటలోని ఐటీఐ కళాశాల భవనం

వేధిస్తున్న స్థలం కొరత

కాజీపేట ప్రాంతంలో ఏడేళ్లుగా నిర్వహిస్తున్న ఐటీఐ ఆవరణలో నూతన భవనాల నిర్మాణానికి అవసరమైన స్థలం లేకపోవడమే ప్రధాన సమస్యగా మారింది. విద్యార్థుల శిక్షణకు అవసరమైన మౌలిక వసతుల కల్పనతో పాటు నూతన భవనాల నిర్మాణానికి దాదాపు 10వేల చదరపు అడుగుల భూమి అవసరం. నిధులున్నా సరైన స్థలం అందుబాటులో లేని కారణంగా అధికారులు ప్రత్యామ్నాయ స్థలం కోసం ప్రయత్నిస్తున్నారు. స్థానికంగా అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాలను పరిశీలిస్తున్నారు. రాంపూర్ ఇండస్ట్రీయల్, విద్యానగర్ బాలుర ఉన్నత పాఠశాలతో పాటు పట్టణంలో ఖాళీగా ఉన్న స్థలాల్లో అనువైన స్థలం ఎంపిక చేయాలని చూస్తున్నప్పటికీ కేటాయించడానికి అనేక సాంకేతిక కారణాలు అడ్డంకిగా మారుతున్నట్లుగా అధికారులు చెబుతున్నారు. ప్రస్తుత ఐటీఐ స్థలం సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలాలను పరిశీలించి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. స్థలం కేటాయించకుంటే నిధులు నిరుపయోగం కావడమే కాకుండా విద్యార్థులకు అవసరమైన వసతులు అందకుండా పోయే అవకాశం ఉందని చెబుతున్నారు.

ప్రభుత్వ స్థలాలను విస్మరిస్తున్న అధికారులు

కాజీపేట పట్టణంలో అనేక ప్రభుత్వ స్థలాలు కబ్జాలో ఉన్నవిపోనూ మిగిలిన స్థలాలపై అధికారులు దృష్టి సారించకపోవడం చర్చనీయంశంగా మారింది. ఐటీఐకి అతి సమీపంలో ఉన్న కడిపికొండ శివారు 46, 55, 1002 సర్వే నంబర్లలో కావాల్సినంత స్థలం ఖాళీగా ఉందని పలువురు సూచిస్తున్నారు. కొంతమంది ఆయా స్థలాలను ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టకుండా ప్రహరీ నిర్మించుకుని వదిలేశారు. జిల్లా అధికార యంత్రాంగం చొరవ తీసుకుని ఆ దిశగా ప్రయత్నిస్తే ఐటీఐకి సరిపోను జాగా లభిస్తుందని అభిప్రాయపడుతున్నారు.

స్థల సేకరణపై అధికారులతో చర్చిస్తున్నాం



ఐటీఐ స్థల సేకరణకు ఎదురవుతున్న ఇబ్బందులపై ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేస్తున్నాం. అధికారులతో సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నాం. ఐటీఐకి అనువైన స్థలం ఇప్పించి ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా భవనాలు కట్టిస్తాం.

– నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్యే

గ్రాండ్ పేరెంట్స్ సలహాలు అవసరం

జిల్లా సంక్షేమ అధికారి జయంతి

హసన్‌పర్తి: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు విద్యతో పాటు సామాజిక, కుటుంబ విలువలు ఎంతో అవసరమని హనుమకొండ జిల్లా సంక్షేమ అధికారి జయంతి అన్నారు. భీమారం జిల్లా పరిషత్ పాఠశాలలో గ్రాండ్ పేరెంట్స్ డే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, విద్యారణ్యపురి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జయంతి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విలువలతో కూడిన విద్యాభివృద్ధికి తాత, నానమ్మలు, అమ్మమ్మలు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. హెల్పేజ్ ఇండియా కోఆర్డినేటర్ శ్యాంకుమార్ మాట్లాడుతూ తమ నాన్నమ్మ, అమ్మమ్మ, తాతయ్యల యోగక్షేమాలను పిల్లలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వారితో సన్నిహితంగా ఉండాలని సూచించారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దామెర నర్సయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీడబ్ల్యూసీ సభ్యుడు కజాంపురం దామోదర్, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తేరాల యుగంధర్, ప్రధానోపాధ్యాయుడు శ్యాంకుమార్, అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు శ్రీనివాసమూర్తి, ఉపేంద్రాచారి, రవీందర్, మలహాల్‌రావు, లక్ష్మీనారాయణ, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జయంతి

గాలికుంటు వ్యాధి ప్రమాదకరం



టీకా వేస్తున్న తీరును పరిశీలిస్తున్న సభ్యులు

హసన్‌పర్తి: పశువుల్లో గాలికుంటు వ్యాధి ప్రమాదకరమని డాక్టర్ రజనీ తెలిపారు. హనుమకొండ జిల్లా వ్యాప్తంగా చేపడుతున్న ఉచిత గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని హైదరాబాద్ నుంచి వచ్చిన ప్రత్యేక బృందం హసన్‌పర్తి మండలంలోని సీతానాగారం, పెంబర్తి గ్రామాలను శుక్రవారం సందర్శించింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో టీకాలు వేస్తున్న తీరును బృంద సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా రజనీ మాట్లాడుతూ ఆరు నెలలకొకసారి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ వెంకట నారాయణ, ఏడీలు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ నాగమణి, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ క్రాంతి, డాక్టర్ అర్చన, డాక్టర్ దీపిక, వీఎల్‌ఓ బింగి సురేష్, అజీమ్‌పాషా, రమేష్, ఇఫ్తెకార్ అలీ తదితరులు పాల్గొన్నారు.

అధికారంలో భాగస్వామ్యం కల్పించాలి

హన్మకొండ: వనరుల్లో వాటా, అధికారంలో భాగస్వామ్యం కలిపించాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ కోరారు. దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో హనుమకొండలో కులగణనను స్వాగతిద్దాం – సామాజిక న్యాయం సాధిద్దాం అనే అంశంపై శుక్రవారం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం తామెంతో తమకు అంత వాటా సాధన ఉద్యమానికి సామాజిక కుల గణన సామాజిక సర్వే దోహదపడుతుందన్నారు. దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని సూచించారు. సదస్సులో దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్ కుమార్, ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్, జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జిలుకర శ్రీనివాస్, ఆల్ ఇండియా ఓబీసీ జేఏసీ చైర్మన్ సాయిని నరేందర్, తెలంగాణ ఉద్యమకారుల వేదిక కన్వీనర్ సోమ రామ్మూర్తి, ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న శంకర్

అప్పటివరకు నియామకాలు నిలిపివేయాలి



మాట్లాడుతున్న మంద కుమార్‌మాదిగ

హన్మకొండ: ఎస్సీ వర్గీకరణ జరిగే వరకు రాష్ట్రంలో ఉద్యోగ నియామకాలు నిలిపివేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్ర భిక్షపతి మాదిగ, ఎమ్మెస్పీ జాతీయ నాయకుడు మంద కుమార్ మాదిగ డిమాండ్ చేశారు. హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ, అనుబంధ సంఘాల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి ఎస్సీ వర్గీకరణను అమలు చేయడంలో దేశంలోనే తొలి రాష్ట్రంగా తెలంగాణను నిలబెడతామని సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదని విమర్శించారు. ఎమ్మెస్పీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు వేల్పుల సూరన్న, బొడ్డు దయాకర్, జన్ను దినేష్ మాదిగ, జి.సుకుమార్, ఉమామహేష్, సుంచు రజిని కుమార్, ధరిగి శ్రీనివాస్, రాజరపు క్రాంతి, ఎర్ర రాము, బొక్క రాజేష్ మాదిగ, రేణుకుంట్ల రాజేందర్, మాదాసి కిరణ్, రాకేష్ పాల్గొన్నారు.

పెరిగిన జీతాలు తక్షణమే అమలు చేయాలి

వరంగల్ చౌరస్తా: గతంలో పెరిగిన జీతాలను వరంగల్ పాత బీట్ బజార్‌లో కిరాణం అండ్ అనాజ్ దుకాణాల్లో పనిచేస్తున్న గుమాస్తాలు, కార్మికులకు తక్షణమే అమలు చేయాలని సీఐటీయూ వరంగల్ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి డిమాండ్ చేశారు. ఆల్‌షాప్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దుకాణ సముదాయాల్లో శుక్రవారం సర్వే నిర్వహించి వేతనాలు, ఇతర సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిన జీతాలు ఇవ్వాలని అడిగితే కార్మికులను యజమానులు అనేక ఇక్కట్లకు గురి చేస్తున్నారని విమర్శించారు. తక్కువ వేతనాలతో రోజుకు 12 గంటలపాటు పనిచేస్తున్న కార్మికులకు పనిభద్రత లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కుమార్, అశోక్, అనిల్, వెంకటేశ్వర్లు, రాధిక, రమ్య, రాజు, యాదగిరి పాల్గొన్నారు.



కిరాణా దుకాణాల్లో సర్వే చేస్తున్న నాయకులు

నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

మామునూరు: తేమ లేకుండా నాణ్యమైన వరిధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని, మద్దతు ధర పొందాలని రైతులకు స్థానిక కార్పొరేటర్ గద్దె బాబు, మండల పీఏసీఎస్ సొసైటీ ఉపాధ్యక్షురాలు సోల్తి భూమాత సూచించారు. బొల్లికుంటలో వినాయక రైతు ఎంఏసీఎస్ సెంటర్ నిర్వాహకురాలు సోల్తి అభినేత్ర ఆధ్వర్యంలో మండల విస్తరణ అధికారి సత్యప్రకాశ్ పర్యవేక్షణలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సన్నధాన్యానికి ప్రోత్సాహకంగా క్వింటాకు రూ.500ల బోనస్ ఇవ్వనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సోల్తి రామస్వామి, డైరెక్టర్ దొంతి వేమనరెడ్డి, మాజీ సర్పంచ్ పసునూరి వేణుగోపాల్, యాకుబ్, టోని, సంపత్, భరత్, సమ్మక్క, శ్రీను, రాజు, యూత్ అధ్యక్షుడు సోల్తి నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

నేడు నీటి సరఫరా బంద్

వరంగల్ అర్బన్: వరంగల్ పరిధిలోని ప్రతాపరుద్ర (దేశాయిపేట) ఫిల్టర్ బెడ్‌లో పైపులైన్ల నిర్వహణ పనులు కొనసాగుతున్న క్రమంలో శనివారం పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరా ఉండదని బల్దియా ఈఈ శ్రీరామోజు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్‌లోని మండిబజార్, చార్‌బౌలి వాటర్ ట్యాంక్ పరిధిలోని పలు కాలనీల్లో నీటి సరఫరా ఉండదని పేర్కొన్నారు.

మొబైల్‌కు దూరంగా ఉంచాలి



హసన్‌పర్తి: పిల్లలను మొబైల్‌కు దూరంగా ఉంచాలని ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ వెంకన్న సూచించారు. హసన్‌పర్తి మండల కేంద్రంలో జాగృతి కళాబృందం ఆధ్వర్యంలో శుక్రవారం కళా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా నేరంగా పరిగణించాలని చెప్పారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. పిల్లలతో తల్లిదండ్రులు స్నేహపూర్వకంగా ఉండాలని సూచించారు. స్థానిక పోలీస్ ఇన్‌స్పెక్టర్ చేరాలు మాట్లాడుతూ పిల్లలకు కిశోర దశ చాలా కీలకమని వివరించారు. సీసీ కెమెరాల ఆవశ్యత, 100, 108, 1930 నంబర్ల ప్రాధాన్యతను చెప్పారు. కార్యక్రమంలో ఎస్సైలు దేవేందర్, నాగమణి, పోలీస్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

ఇంటింటి కులగణన సర్వే

ఖిలా వరంగల్: సమగ్ర కుటుంబ సర్వే కొనసాగుతోంది. వరంగల్ రైల్వేగేట్ ప్రాంతంలోని విలీన గ్రామాలతోపాటు పలు డివిజన్లలో సర్వే అధికారులు ఇంటింటికి స్టిక్కర్లను అతికించారు. అధికారులతో కలిసి స్థానిక కార్పొరేటర్లు ముస్కమల్ల అరుణ, దిడ్డి కుమారస్వామి, మరుపల్లి రవి, పల్లం పద్మ, వేల్పుగొండ సువర్ణ, బైరబోయిన ఉమ, గుండు చందన, గద్దె బాబు, ఈదుల అరుణ పాల్గొన్నారు.

'రాజకీయ లబ్ధి కోసమే కులగణన'

దేశాయిపేట: కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసమే కులగణన చేపట్టిందని బీజేపీ వరంగల్ జిల్లా కార్యదర్శి జి.వెంకటేష్ ఆరోపించారు. కులగణనలో ప్రజల ఆస్తులు, భూములు, వ్యక్తిగత వివరాలను ఎందుకు సేకరిస్తున్నారో కాంగ్రెస్ నాయకులు చెప్పాలని డిమాండ్ చేశారు. కులగణనలో ఎవరు ఏ రాజకీయ పార్టీలో ఉన్నారనే వివరాలు ఎందుకని ప్రశ్నించారు. బీసీలను మోసం చేయడానికే ఈ సర్వే చేస్తున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు.

రూ.16,330ల గుట్కా ప్యాకెట్ల పట్టివేత

ఖిలా వరంగల్: ఓ ఏజెన్సీలో అక్రమంగా నిల్వ చేసి విక్రయిస్తున్న రూ.16,330ల విలువైన గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం వరంగల్ రైల్వే గేట్ ప్రాంతం మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమేశ్వర్ ఏజెన్సీలో గుట్కా ప్యాకెట్లు నిల్వచేసి వ్యాపారులకు విక్రయిస్తున్నట్లు పక్కా సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం దాడి చేశారు. గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని నిందితుడు మహ్మద్ మహబూబ్‌పై కేసు నమోదు చేసి తదుపరి చర్యల నిమిత్తం కేసును మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ రంజిత్‌కుమార్ వివరించారు.

రైల్వే డ్రైవర్ల కార్యాలయంలో 'సంఘ్' ప్రచారం

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే డ్రైవర్ల కార్యాలయంలో రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ లోకోరన్నింగ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో రైల్వే గుర్తింపు ఎన్నికల వన్ ఇండస్ట్రీ వన్ యూనియన్ ప్రచారం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా లోకోరన్నింగ్ బ్రాంచ్ వర్కింగ్ చైర్మన్ పాక రాజ్‌కుమార్, ట్రెజరర్ పి.సుధాకర్ మాట్లాడుతూ సంఘ్ జనరల్ సెక్రటరీ డాక్టర్ మర్రి రాఘవయ్య నేతృత్వంలో రైల్వే కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న సంఘ్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రైల్వే సంఘ్ నాయకులు లక్ష్మీనారాయణ, అజీజ్‌పాషా, సురేష్‌కుమార్, రవి, సునీల్, లోకోపైలెట్లు, అసిస్టెంట్ లోకోపైలట్లు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఖిలా వరంగల్: వరంగల్ పడమరకోట జంక్షన్‌లో రూ.5లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా స్థానిక కార్పొరేటర్ బైరబోయిన ఉమ హాజరై పనులను శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో గజ్జెల శ్యామ్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి దుర్మరణం

కాజీపేట రూరల్: కాజీపేట జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోమటిపల్లి – హసన్‌పర్తి స్టేషన్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి శుక్రవారం ప్రమాదవశాత్తు రైలు ఢీకొని దుర్మరణం చెందాడని కాజీపేట జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ వెంకట్‌రెడ్డి తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



రామన్నపేట: ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలోని తిలక్ స్టేడియంలో జరగనున్న రాష్ట్ర స్థాయి అండర్ –19 సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎల్‌బీ కళాశాలలో ఎంపీసీ ప్రథమ సంవత్సరం చదువుతున్న క్రాంతి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల నగరంలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించిన అండర్ జూనియర్ కళాశాలల జిల్లాస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రాంతి.. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. ఈమేరకు క్రాంతిని కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు కళాశాల చైర్మన్ భాగ్యనారాయణ, సెక్రటరీ కం కరస్పాండెంట్ వినయ్‌కుమార్, పీడీ బి.ప్రభాకర్, గేమ్స్ కమిటీ సభ్యులు మధుకర్‌రావు, రవీందర్‌రెడ్డి, సుధాకర్, సుచిత్ర, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.



విద్యారణ్యపురి: స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన అండర్ –19 హనుమకొండ జిల్లాస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో హనుమకొండలోని ప్రభుత్వ ఒకేషనల్ కళాశాల ప్రథమ సంవత్సరం విద్యార్థి జమ్మిడి కార్తీక్ పాల్గొని ప్రతిభ కనపర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ శుక్రవారం తెలిపారు. ఈనెల 9నుంచి 12వ తేదీ వరకు ఆసిఫాబాద్ జిల్లా బెల్లంపల్లిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడాపోటీల్లో విద్యార్థి పాల్గొననున్నట్లు వివరించారు. ఈ మేరకు కార్తీక్‌ను కళాశాలలో హనుమకొండ జిల్లా డీఐఈఓ గోపాల్, ప్రిన్సిపాల్ శ్రీధర్, తదితరులు శుక్రవారం అభినందించి, ట్రాక్ షూట్, బూట్లు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ శ్రీనివాస్, ఇన్‌చార్జ్ హెచ్ఎం రాజేంద్రప్రసాద్, అధ్యాపకులు రాజశేఖర్‌రెడ్డి, విష్ణుకాంత్ పాల్గొన్నారు.

'శ్రీచైతన్య' విద్యార్థుల ప్రతిభ



వరంగల్: శ్రీచైతన్య విద్యాసంస్థల విద్యార్థులు మైలురాయిని అధిగమించారని అకాడమిక్ డైరెక్టర్ సీమ తెలిపారు. నవంబర్ 6న నిర్వహించిన సూపర్ పవర్ హ్యాట్రిక్ వరల్డ్ రికార్డు ఈవెంట్‌లో 20రాష్ట్రాల నుంచి 10వేల మంది విద్యార్థులు పాల్గొని 3గంటల్లో 600మ్యాథ్స్ ఫార్ములాలు ఏకకాలంలో పఠించి ప్రపంచ రికార్డు సృష్టించినట్లు తెలిపారు. ఈ ఈవెంట్‌లో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు.

సంచార జాతుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

హన్మకొండ: బలహీన వర్గాల్లో అత్యంత వెనుకబడిన సంచార జాతుల సంక్షేమానికి సంచార జాతుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరుణహరి శేషు కోరారు. ఈమేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. హనుమకొండలో శుక్రవారం ఆయన లేఖ విడుదల చేసి మాట్లాడారు. రాష్ట్రంలో బీసీల సంక్షేమానికి బీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేశారని, అదేవిధంగా 2017లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్.. ఎంబీసీల సంక్షేమానికి ఎంబీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేసి బడ్జెట్‌లో నిధులు కేటాయించి ఖర్చు చేయలేదని పేర్కొన్నారు. బీసీ కులాల్లో 30 నుంచి 40 వరకు సంచార జాతుల కులాలున్నాయని వివరించారు. వారికి న్యాయం చేయాలని కోరారు.

సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు

సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను నగర వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేకులు కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సంబురాలు జరుపుకుంటున్న వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు స్వర్ణ, నాయకులు



కేయూలో దూరవిద్యా కేంద్రంలో 'పాస్' అధ్యక్షుడు సంగని మల్లేశ్వర్, బాధ్యులు



ఆయుర్వేద ఆస్పత్రిలో పండ్ల పంపిణీ..



దుబాయ్‌లోని బుర్జు ఖలీఫా వద్ద వేడుకలు జరుపుకుంటున్న నాయకులు